# జనరల్ స్టడీస్

# భారతదేశ చరిత్ర - సంస్కృతి



**జా**తీయ, రాష్ట్రస్థాయిలో నిర్వహించే అన్ని పోటీ పరీక్షల్లో 'భారతదేశ చరిత్ర' అత్యంత ముఖ్యమైన విభాగం. విస్తృతమైన సిలబస్ దృష్ట్యా దీనిలో పట్టు సాధించడానికి గట్టి ప్రయత్నం చేయాల్సి ఉంటుంది. అసంఖ్యాక సంఘటనలు, లెక్కలేనన్ని తేదీలు, నిరంతర యుద్ధాలు, సంధులు, పరిపాలనా సంస్కరణలు, సాంస్కృతిక కట్టడాలు, వివిధ ఉద్యమాలు ఇలా అనేక విశేషాలతో కూడిన 'గతం' గురించి చదవడం ఎంత ఆసక్తికరమో అంతే కష్టతరం. ముఖ్యంగా నాన్ ఆర్ట్స్ అభ్యర్థులకు చాలా ఇబ్బందిగా ఉంటుంది. దీనిని ఎలా అధిగమించాలి? గుర్తుంచుకోవడం ఎలా, పద్ధతి ఏమిటి, పాటించాల్సిన మెలకువలు, చదవాల్సిన పుస్తకాలు మొదలైన అంశాలను సమగ్రంగా చూద్దాం.

### పాఠ్యాంశాలను విభజించి చదవాలి

చరిత్రకారులు భారతదేశ చరిత్రను ఆయా కాలాల్లో సంభవించిన ప్రత్యేక పరిణామాలు, మార్పుల ఆధారంగా మూడు యుగాలుగా విభజించారు. ప్రాచీన యుగం, మధ్యయుగం, ఆధునిక యుగం. అభ్యర్థులు ఈ యుగాల్లో సంభవించిన సంఘటనలు మార్పులను సునిశితంగా గమనించి ప్రత్యేకతలపై దృష్టి సారించాలి. ఉదాహరణకు ప్రాచీనయుగం ముగిసి మధ్యయుగం ప్రారంభమైందని అన్నప్పుడు ఆ సంవత్సరాన్ని కొత్తయుగం కటాఫ్ తేదీగా ఎందుకు నిర్ణయించాల్సి వచ్చింది, ఆ వైవిధ్యం ఏమిటో పసిగట్టాలి. విశేషాలు తెలుసుకోవాలి. అలాంటి అంశాలపై ఎక్కువ ప్రశ్నలు వస్తున్నాయని గమనించాలి.

### ప్రాచీనయుగంపై పట్టు సాధించాలి

భారతదేశ ప్రాచీనచరిత్రలో అనేక ప్రత్యేకతలున్నాయి. ముఖ్యంగా చరిత్రకు ఆధారాలు సాహిత్య వర్గీకరణ, వాటి విలువ, కృతికర్తలు మొదలైన అంశాలను చదవాల్సి ఉంటుంది. వైదిక, జైన, బౌద్ధ సాహిత్యాలు, చతుర్వేదాలు, వేదాంగాలు, అష్టాదశ పురాణాలు, రామాయణ, మహాభారత ఇతిహాసాలు, త్రిపీఠికాలు, అంగాలు, ద్వీపవంశ, మహావంశ అనే గ్రంథాలు మొదలైన వాటి గురించి తెలుసుకోవాలి. అలాగే కౌటిల్యుని అర్థశాస్త్రం, పాణిని అష్టాధ్యాయ, పతంజలి మహాభాష్యం, కాళిదాసు నాటకాలు, విశాఖదత్తుని ముద్రారాక్షసం, గుణాఢ్యుడు బృహత్కథ, హాలుని గాథాస్తపశతిని గుర్తుంచుకోవాలి. ఉదాహరణకు ఈ ప్రశ్నను పరిశీలించండి.

– పురాణాలు రాజుని ఏ దేవునితో సరిపోల్చాయి?

ఎ) రాముడు　బి) విష్ణువు
సి) బ్రహ్మ　డి) శివుడు

**జవాబు– బి**



బి. కృష్ణారెడ్డి,
క్లాస్–1 స్టడీ సర్కిల్
హైదరాబాద్

**జవాబు: బి**

### విషయ విస్తృతితో కూడిన మధ్యయుగ చరిత్ర

మధ్యయుగ భారతదేశ చరిత్రలో వంశాలు, పరిపాలకులు ఎక్కువగా ఉండటంతో అందుకు సంబంధించిన సమాచారం కూడా విస్తారంగా ఉంటుంది. సమస్త విషయాలను ఔపోసన పట్టాలంటే అధిక కృషి చేయక తప్పదు. అయితే ముఖ్యాంశాలపై పట్టుసాధిస్తే అనుబంధ విషయాలను గుర్తుంచుకోవడం సులభమవుతుంది.

హర్షవర్ధనుని నిష్క్రమణ తరవాత భారత ఉపఖండం చిన్న చిన్న రాజ్యాలుగా విచ్ఛిన్నం కావడం ఈ యుగ ప్రత్యేకత. భారతదేశం ముఖ్యంగా పాల, ప్రతీహార, రాష్ట్రకూటులనే మూడు రాజ కుటుంబాల ఏలుబడిలో ఉండేది. ఈ మూడు రాజ్యాలు, వాటి తరవాత వచ్చిన రాజపుత్ర రాజ్యాలు నిరంతర పరస్పర యుద్ధాలతో క్షీణించపోగా, మహ్మదీయులు భారతదేశంపై దండయాత్ర చేసి తమ ఏలుబడికి తెచ్చుకొని సరికొత్త విశిష్ట సంస్కృతిని నెలకొల్పారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు మధ్యయుగ చరిత్రను అధ్యయనం చేయాలి. రాష్ట్రకూటులు, రాజపుత్ర రాజ్యాలైన చౌహానులు, సోలంకీలు, చందేలులు, చోళ సామ్రాజ్యం, భారతదేశంపై మహమ్మదీయుల దాడులు, ఘజనీ, ఘోరీ దండయాత్ర విశేషాలు, ఢిల్లీ సుల్తానుల రాజ వంశాలైన బానిస, ఖిల్జీ, తుగ్లక్, లోఢీలు, ఢిల్లీ సింహాసనాన్ని అధిష్ఠించిన ఏకైక ముస్లిం మహిళ రజియా సుల్తానా విశిష్టత, మహమ్మద్ బిన్ తుగ్లక్ అనాలోచిత నిర్ణయాలు, భక్తి ఉద్యమాలు, శంకరాచార్యులు – అద్వైతం, మాధవాచార్యుని – ద్వైతం, రామానుజాచార్యుని విశిష్టాద్వైతం, వల్లభాచార్యుని శుద్ధాద్వైతం, నాగార్జునాచార్యుని – ద్వైతాద్వైతం, రామానందుడు, కబీర్, మీరాబాయి, రామదాసు, గురునానక్, తుకారాం, తులసీదాస్ మొదలైన వారి గురించి చదవాలి.

మధ్యయుగ భారతదేశ చరిత్రలో మొఘల్ పరిపాలనకు చాలా విశిష్టత ఉంది. రెండు శతాబ్దాలుగా (1526–1707) నిరాఘాటంగా కొనసాగిన వారి పాలన, చక్రవర్తులు వారి ప్రత్యేకతలను సమగ్రంగా అధ్యయనం చేయాలి. బాబర్, హుమయూన్, షేర్షా సూర్ ప్రవేశపెట్టిన రెవెన్యూ పాలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అక్బర్, జహంగీర్, షాజహాన్, ఔరంగజేబు క్రమశిక్షణ మొదలైన అంశాలను ప్రత్యేకంగా చదవాలి. మొఘల్ చక్రవర్తుల కాలంలో కళాభివృద్ధిని మరవద్దు.

విజయనగర సామ్రాజ్యం, మహారాష్ట్రులు శివాజీ, హైదరాబాద్, కర్ణాటక, మైసూర్ రాష్ట్రం– టిప్పుసుల్తాన్, మలబార్ రాజ్యాలను గురించి తెలుసుకోవాలి. ఉదాహరణకు ఈ ప్రశ్నను గమనించండి...

– **ఎవరి పరిపాలనా కాలంలో దక్షిణ భారతదేశాన్ని జయించుట పూర్తి అయినది?**

ఎ) బాల్బన్ బి) అల్లాఉద్దీన్‌ఖిల్జీ
సి) రజియా సుల్తానా డి) మహమ్మద్ బిన్ తుగ్లక్

**జవాబు: డి**

– **ఉద్యానవనం మధ్యలో సమాధి నిర్మించడం, పాలరాతిని ఉపయోగించడం ఎవరితో మొదలైంది?**

ఎ) హుమయూన్　బి) అక్బర్
సి) షాజహాన్　డి) జహంగీర్

**జవాబు: ఎ**

### గ్రూప్– 1, 2 గైడెన్స్

**ఈ పుస్తకాలు చదవండి**

- భారతదేశ చరిత్ర–సంస్కృతి: తెలుగు అకాడమీ ప్రచురణలు.
- భారత జాతీయోద్యమం: బిపిన్ చంద్ర
- ఎన్‌సిఇఆర్‌టి: 10+2 స్థాయి చరిత్ర పుస్తకాలు.

**ఇలా చేయండి..**

- గత ప్రశ్నపత్రాల విశ్లేషణ.
- ముఖ్యాంశాలపై సొంత నోట్స్ తయారుచేసుకోవడం.

### ఆధునిక యుగం – యూరోపియన్‌ల ఆగమనం

ప్రాచీనకాలం నుంచి భారతదేశం పాశ్చాత్య దేశాలతో వ్యాపార సంబంధాలు కలిగి ఉండేది. క్రీ.శ. 7వ శతాబ్ద ఆరంభంలో సముద్ర వ్యాపారం అరబ్బుల స్వాధీనమైంది. అయితే క్రీ.శ. 1453లో కాన్‌స్టాంటినోపిల్ (ప్రస్తుత ఇస్తాంబుల్) బైజాంటైన్ గ్రీకుల నుంచి తురుష్కులు వశం చేసుకోవడంతో ఈ మార్గంలో జరుగుతున్న వ్యాపారానికి విఘాతం కలిగింది. నూతన సముద్ర మార్గాన్వేషణ ప్రారంభమైంది. వివిధ ఐరోపావారు రాక, వలసల స్థాపన స్థావరాలు, ఆధిపత్య పోరాటాలు, ఆంగ్లేయుల సామ్రాజ్య వ్యాప్తి, కర్ణాటక యుద్ధాలు, ఆంగ్ల– మరాఠా యుద్ధాలు బ్రిటిష్ కంపెనీ పరిపాలన, ఆర్థిక విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. ఉదాహరణకు..

– **భారతదేశానికి వ్యాపార ప్రయోజనాలకై వచ్చిన మొట్టమొదటి, చిట్టచివరి పాశ్చాత్య దేశాలు గుర్తించండి.**

ఎ) పోర్చుగల్, ఫ్రాన్స్ బి) ఇంగ్లాండ్, ఫ్రాన్స్
సి) డచ్, ఇంగ్లాండ్　డి) డెన్మార్క్, పోర్చుగల్

**జవాబు: ఎ**

### భారత జాతీయోద్యమం

జాతీయోద్యమం అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశం. సిపాయిల తిరుగుబాటుతో ప్రారంభమై స్వాతంత్ర్యం సాధించేంత వరకు జరిగిన మహోన్నత పోరాటంలో ఉజ్వల ఘట్టాలు కోకొల్లలు. భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావం, మితవాదులు, అతివాదుల యుగం, స్వదేశీ ఉద్యమం, విప్లవాత్మక తీవ్రవాద ఉద్యమాలు, హోమ్‌రూల్ ఉద్యమం, రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని అహింసే ఆయుధంగా చేసుకొని గడగడలాడించిన మహాత్మాగాంధీ ఆగమనం, సహాయ నిరాకరణ ఉద్యమం, జలియన్ వాలాబాగ్ హత్యాకాండ, సైమన్ వ్యతిరేకోద్యమం, శాసనోల్లంఘన ఉద్యమం, రౌండ్ టేబుల్ సమావేశాలు, క్విట్‌ఇండియా ఉద్యమం, క్యాబినెట్ రాయబార ప్రణాళిక, మౌంట్ బాటెన్ దేశ విభజన పథకం, స్వదేశీ సంస్థానాల విలీనీకరణ మొదలైన పరిణామాలను పరిపూర్ణంగా నిశితంగా చదవాలి.

భారత రాజ్యాంగ చరిత్ర – ముఖ్యంగా రాజ్యాంగ వికాసంలో వివిధ దశలు, చట్టపరమైన, పరిపాలనపరమైన సంస్కరణలు ఉదాహరణకు రెగ్యులేటింగ్ చట్టం, మింటో–మార్లే సంస్కరణలు, మాంటెంగ్–చేమ్స్‌ఫోర్ట్ ప్రతిపాదనలు, భారత ప్రభుత్వం చట్టం 1935 ప్రత్యేకత, రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు రచన మొదలైన విషయాలపై సమగ్ర సమాచారాన్ని సేకరించి చదివి గుర్తుంచుకోవాలి.

హరప్పా నాగరికత, వాటి విశిష్టత, ఆర్యులు– వైదిక సంస్కృతి ప్రత్యేకతలు, పోలికలు, మహాజనపదాలు, మౌర్య సామ్రాజ్యం, రాజకీయ చరిత్ర, పాలనా విధానం, సాంఘిక, ఆర్థిక పరిస్థితులు, వాస్తు శిల్పకళ గురించి క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. మౌర్యులు తరవాత వచ్చిన రాజవంశులైన కణ్వ వంశం, శాతవాహనులు, కళింగులు, శక రాజులు, కుషాణుల వివరాలను కూడా చదవాల్సి ఉంటుంది. ఉదాహరణకు...

– **ఘటికలు అనగా?**

ఎ) బౌద్ధుల విద్యా కేంద్రాలు
బి) హిందూ కళాశాలలు　సి) విప్లవకారులు
డి) మత సంబంధ విషయాలను చూసుకొనే గ్రామాలు

### చరిత్రను ఛేదించే మార్గం..

- జిఎస్‌లో అత్యధిక మార్కులు ఈ విభాగం నుంచే వస్తున్నాయి అనే వాస్తవాన్ని గమనించండి.
- హిస్టరీ 'తేలిక' అనే జనసామాన్య అభిప్రాయం నుంచి బయటపడాలి. పోటీ పరీక్షల్లో 'హిస్టరీ' 'టేస్టు'ను ఆస్వాదించే విధంగా మానసిక సన్నద్ధత ముఖ్యం.
- హిస్టరీ 'డ్రై' సబ్జెక్టు అనే భావన తప్పు. చరిత్రలో ప్రతి సంఘటన కాకతాళీయంగా జరగలేదు. దాని వెనుక ముందు అనేక కారణాలు ముడిపడి ఉన్నాయి. ఒకదానికి ఒకటి అంతర్గత సంబంధాన్ని కలిగి ఉంటాయి. ఆ సారాంశాన్ని గ్రహించాలి. Assimilation, Association టెక్నిక్ ఉపయోగించాలి.
- చరిత్ర అంటే తేదీలు, సంవత్సరాలు అనేది ఒక నాటి మాట. సమకాలీన పోటీ పరీక్షల్లో వాటి ప్రాధాన్యతను బాగా తగ్గించారు. సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలపై ఎక్కువ ప్రశ్నలు వస్తున్నాయి. రాజకీయ చరిత్ర ఒక కనెక్టింగ్ లైన్‌గానే పరిగణించాలి.
- ప్రిపరేషన్ రెండు దశలుగా చేయండి. మొదటిదశ 'Extensive'గా ఉండాలి. అంటే అన్ని విషయాలను విస్తారంగా చదవాలి, ఒక అవగాహన ఏర్పర్చుకోవాలి. రెండో దశలో ముఖ్యాంశాలపై 'Focus' లేదా 'Intensive' అధ్యయనం కొనసాగించాలి.
- త్రీ 'R' టెక్నిక్‌ను ఉపయోగించాలి.
  Read - చదవాలి.
  Retrive - నిక్షిప్తం (స్టోర్ చేయాలి)
  Recall - పునఃశ్చరణ చాలా ముఖ్యం.
  లేకపోతే ప్రిపరేషన్ సంపూర్ణం కాదు.
- తెలిసి తప్పులు చేస్తుంటారు. కారణం అజాగ్రత్త లేదా తొందరపాటు. ఇంకా చెప్పాలంటే ఫలితం గురించి ఆందోళన కావచ్చు. సంపూర్ణ విశ్వాసంతో ప్రిపరేషన్ కొనసాగించండి, ధ్యాస 'పని'పై ఉండాలి 'ఫలితం'పై కాదు.

- Those who do not learn lessons from History, are condemned to repeat it.

విష్ యు గుడ్ లక్

## అడ్మిషన్స్



### టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్

**టా**టా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌ల నోటిఫికేషన్ వెలువడింది. **చివరి తేదీ:** అక్టోబర్ 23

సోషల్ వర్క్, డిసెబిలిటీ స్టడీస్ అండ్ యాక్షన్, డెవలప్‌మెంట్ స్టడీస్, ఎడ్యుకేషన్, కౌన్సెలింగ్, ఉమెన్ స్టడీస్, హెచ్‌ఆర్ మేనేజ్‌మెంట్ అండ్ లేబర్ రిలేషన్స్, సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, గ్లోబలైజేషన్ అండ్ లేబర్, పబ్లిక్ హెల్త్(హెల్త్ పాలసీ, ఎకనామిక్ అండ్ ఫైనాన్స్), పబ్లిక్ హెల్త్ (సోషల్ ఎపిడమోలజీ), హెల్త్ అడ్మినిస్ట్రేషన్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, హాబిటేట్ పాలిసీ అండ్ ప్రాక్టీస్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, మీడియా అండ్ కల్చరల్ స్టడీస్ సబ్జెక్టులు ఉన్నాయి.

**అర్హతలు:** ఏదైనా డిగ్రీ.

**చిరునామా:** టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, పూర్వ మార్గ్, దేవ్‌నార్, ముంబాయ్– 400 088, **ఈమెయిల్:** pgadmissions@ tiss.edu **ఫోన్:** (022) 25525262

### ఇంటెలెక్చువల్ లాలో...

**మా**స్టర్ ఆఫ్ ఇంటెలెక్చువల్ లా, స్కూల్ ఆఫ్ లా, ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ. **చివరి తేదీ:** సెప్టెంబర్ 15
రెండు సంవత్సరాల కాలపరిమితి గల డిస్టెన్స్ ప్రోగ్రామ్. ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్ యూనివర్సిటీ కొలాబరేషన్‌తో ఈ కోర్సును రూపొందించారు.
**అర్హత:** ఏదైనా డిగ్రీ.
**చిరునామా:** డైరెక్టర్, స్కూల్ ఆఫ్ లా, జాకీర్ హుస్సేన్ భవన్, జి బ్లాక్, అకడమిక్ కాంప్లెక్స్, ఇగ్నో, మైదాన్ గర్హి, న్యూఢిల్లీ– 110 068.
**ఈమెయిల్:** srikrishnadeorao@ignou.ac.in

### కంపెనీ సెక్రెటరీషిప్ ఫౌండేషన్ ప్రోగ్రామ్

**కం**పెనీ సెక్రెటరీషిప్ ఫౌండేషన్ ప్రోగ్రామ్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రెటరీస్ ఆఫ్ ఇండియా. **చివరి తేదీ:** సెప్టెంబర్ 30. **పరీక్ష:** 2010 జూన్‌లో జరుగుతుంది.
**అర్హత:** ఇంటర్ పూర్తి చేసి ఉండాలి.
**చిరునామా:** 22, ఇండస్ట్రియల్ ఏరియా, లోడీ రోడ్, న్యూఢిల్లీ – 110 003.
వెబ్‌సైట్ www.icsi.edu

### అహ్మదాబాద్ ఐఐఎమ్‌లో...

అహ్మదాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో కొన్ని ఫెల్లో ప్రోగ్రామ్స్‌కు నోటిఫికేషన్ వెలువడింది.
**చివరి తేదీ:** డిసెంబర్ 15. అగ్రికల్చర్, బిజినెస్ పాలసీ, ఎకనామిక్స్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, మార్కెటింగ్, ఆర్గనైజేషనల్ బిహేవియర్, పర్సనల్–ఇండస్ట్రియల్ రిలేషన్స్, ప్రొడక్షన్ క్వాంటిటేటివ్ మెథడ్స్, పబ్లిక్ సిస్టమ్స్ సబ్జెక్టులు ఉన్నాయి.
**అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ లేదా సిఏ/ ఐసిడబ్ల్యూఏ/ సిఎస్ లేదా కనీసం 60 శాతం మార్కులతో నాలుగు సంవత్సరాల బ్యాచిలర్ డిగ్రీ.
**చిరునామా:**
ఎఫ్‌పిఎమ్ ఆఫీస్, ఐఐఎమ్ వస్త్రపుర్, అహ్మదాబాద్ – 380 015, వెబ్‌సైట్ www.iimahd.ernet.in/programmes

## నోటిఫికేషన్లు



## గ్రూప్– 1స్క్రీనింగ్ టెస్ట్

# భారత ఆర్థిక వ్యవస్థ

# గణాంకాల ధోరణులు



డాక్టర్ టి.సాయిలు

**పో**టీ పరీక్షలకు తయారయ్యే విద్యార్థులు 'భారత ఆర్థిక వ్యవస్థ'కు సంబంధించి ఎదుర్కొనే ప్రధాన సమస్య గణాంకాల సమాచారాన్ని జ్ఞాపకం పెట్టుకోవడం. అభ్యర్థులు గమనించాల్సిన విషయం ఏమంటే గణాంక సమాచారాన్ని గణాంకాల ధోరణిని అర్థంచేసుకోవడం కోసం ఇవ్వడం జరుగుతుంది కాని జ్ఞాపకం పెట్టుకోవడం కోసం కాదు. ఉదాహరణకు జాతీయాదాయంలో వ్యవసాయరంగం వాటా పెరుగుతున్నదా? తగ్గుతున్నదా? మారడం లేదా ?మార్పు ఉంటే ఎంత వేగంగా ఉంది?..ఈ పరిణామాలను గమనించాలే గాని దీని శాతం ఎంత? దాని శాతం ఎంత అన్న విషయాలు అంత ప్రాధాన్యం కావు. మరి శాతానికి సంబంధించిన ప్రశ్నలు రావా? అంటే వస్తాయి. కాని చలాంక ధోరణిని విద్యార్థి గమనిస్తున్నాడా లేదా అనే విధంగానే ప్రశ్న ఉంటుంది. ఉదాహరణకు భారత జాతీయాదాయంలో వ్యవసాయరంగం వాటా ఎంత? అనే ప్రశ్న గ్రూప్–1 స్క్రీనింగ్ పరీక్షలో అడిగారు.

సాధారణంగా భారతదేశంలో ఎక్కువమంది ప్రజలు వ్యవసాయరంగంపై ఆధారపడి ఉన్నారు. కనుక జాతీయాదాయంలో వ్యవసాయరంగం వాటా కూడా ఎక్కువగా ఉంటుందన్న భావనతో విద్యార్థులు ఉంటారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు నిజంగానే మన జాతీయాదాయంలో వ్యవసాయరంగ వాటా ఎక్కువ (57 శాతం)గానే ఉన్నది. కానీ అది క్రమంగా తగ్గింది (ప్రస్తుతం 17.8 శాతం). ఈ మార్పును లేదా ధోరణిని విద్యార్థి గమనించాడా లేదా అన్నదే ఈ ప్రశ్న వెనుక గల ఉద్దేశం. అందువల్ల గణాంకాల ధోరణిని గమనిస్తూ చదివిన విద్యార్థి సులభంగా పై సమాచారాన్ని జ్ఞాపకం పెట్టుకొని అడిగిన ప్రశ్నకు సమాధానం సులభంగా రాయగలడు. అలాగాక శాతాన్ని బట్టీపట్టిన విద్యార్థికి పరీక్షలో ఒత్తిడి దృష్ట్యా గణాంక సమాచార సమాధానం విషయంలో తికమకపడతాడు. దేశాల ఆర్థికాభివృద్ధి పరిణామ క్రమంలో జాతీయాదాయం పెరుగుతుంటుంది. ఆ క్రమంలో వ్యవసాయరంగం ఆదాయం పెరగవచ్చు. కానీ పారిశ్రామిక, సేవారంగాల ఆదాయం ఎక్కువగా పెరిగి జాతీయాదాయంలో వ్యవసాయరంగం నుంచి వచ్చే ఆదాయం శాతం(వాటా) పరంగా తగ్గిపోతుంది. దీని అర్థం వ్యవసాయరంగం క్షీణించిందని కానీ, వ్యవసాయరంగ ఉత్పత్తి తగ్గిందని కానీ కాదు. వాస్తవానికి జాతీయాదాయంలో వ్యవసాయరంగం వాటా తక్కువగా ఉండటమంటే పారిశ్రామిక, సేవా రంగాల్లో ఆ దేశం ముందుకు వెళ్లిందని అర్థం.

ఆవిధంగా గణాంకాలను విషయాన్ని అర్థం చేసుకోవడానికి ఇవ్వడం జరుగుతుంది. గణాంకాలను జ్ఞాపకం పెట్టుకోవడానికి కాదు. ఒకసారి ఎనిమిదో పంచవర్ష ప్రణాళిక కాలంలో భారతదేశంలో నమోదైన సగటు ఆర్థిక వృద్ధిరేటు ఎంత? అనే ప్రశ్నను గ్రూప్–1 స్క్రీనింగ్ పరీక్షలో అడిగారు. భారతదేశంలో ఆర్థిక సంస్కరణలు ఆరంభమైన తరవాత అమలు జరిగిన మొదటి పంచవర్ష ప్రణాళిక ఎనిమిదో పంచవర్ష ప్రణాళిక. అందువల్ల ఈ పంచవర్ష ప్రణాళికా కాలంలో ఆర్థికవృద్ధి (ఉత్పత్తిలో పెరుగుదల) ఎలా ఉంది? అని గమనించడం, అంతే కాకుండా గతంలో అమలు జరిగిన ఏ పంచవర్ష ప్రణాళిక కాలంలో నమోదు కాని 'ఆర్థికవృద్ధి' ఎనిమిదో పంచవర్ష ప్రణాళిక కాలంలో నమోదైంది. (ఎనిమిదో పంచవర్ష ప్రణాళిక సగటు వృద్ధి 6.7 శాతం). ఈ మార్పును అభ్యర్థి గమనిస్తున్నాడా లేదా అని పరీక్షించడానికి పై ప్రశ్నను అడగడం జరిగింది. 2002 నుంచి 2007 వరకు అమలు జరిగిన పదో పంచవర్ష ప్రణాళిక కాలంలో సగటు వార్షిక ఆర్థికవృద్ధి 7.5 శాతం. ఇంత వృద్ధిరేటు అంతకుముందు ఎప్పుడూ నమోదు కాలేదు. అంతే కాకుండా ఇటీవల ముగిసిన పంచవర్ష ప్రణాళిక గనుక, రాబోయే పరీక్షలో ఈ ప్రశ్న వస్తే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు.

మొత్తం మీద గణాంకాల విషయంలో అభ్యర్థి మూడు అంశాల ఆధారంగా గణాంకాలను జ్ఞాపకం ఉంచుకునే ప్రయత్నం చేయాలి. అవి–

1) చలాంక ధోరణి

2) ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన మార్పు

3) ఇటీవల వచ్చిన మార్పు

పై మూడింటిలో ఇటీవల వచ్చిన మార్పు గురించి కొంత లోతుగా అభ్యర్థిని పరీక్షించే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు ఒకసారి గ్రూప్–1 స్క్రీనింగ్ పరీక్షలో సేవారంగం పరిధిలోని అంశాల్లో ఎక్కువ వృద్ధిని సాధించిన 'ఉప రంగం' ఏది? అని అడిగారు. గత ప్రశ్న స్వభావాన్ని బట్టి దేశ ఆర్థికవృద్ధిని ప్రభావితం చేస్తున్న సేవా రంగమే కాదు; సేవారంగంలో ఏ ఉపరంగం ఎక్కువగా ప్రభావితం చేస్తున్నది అన్న విశ్లేషణను అభ్యర్థి చేయాల్సిన అవసరం కనిపిస్తుంది. అందువల్ల ఏ రంగంలో ఎన్ని ఉప రంగాలు ఉన్నాయి. వాటిలో 2008–09 సంవత్సరంలో వచ్చిన వృద్ధి ఎంత అన్నది చూద్దాం.

**ప్రాథమిక రంగం (వ్యవసాయరంగం)**

ఇందులో వ్యవసాయం, అడవులు, చేపల పెంపకం, ఖనిజాల తవ్వకాలను చేరుస్తారు.

**ద్వితీయరంగం (పారిశ్రామిక రంగం)**

వస్తువుల తయారీ, విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా, నిర్మాణాలను చేరుస్తారు.

**తృతీయరంగం (సేవారంగం)**

వ్యాపారం, హోటళ్లు, రెస్టారెంట్లు, రవాణ , నిల్వ, సమాచారం, ఫైనాన్స్, బీమా, రియల్ ఎస్టేట్, వ్యాపార సేవలు, కమ్యూనిటీ, సాంఘిక, వ్యక్తిగత సేవలను చేరుస్తారు.

ఇటీవల కేంద్ర ఆర్థికశాఖ విడుదల చేసిన 2008–09 భారత ఆర్థిక సర్వే ప్రకారం ఉత్పత్తి కారకాల ధరల్లో నికర దేశీయోత్పత్తి 2008–09 ఆర్థిక సంవత్సరంలో 6.7 శాతం వృద్ధి చెందగా వివిధ ఉప రంగాల వృద్ధి కింద విధంగా ఉంది.

పై పట్టికను పరిశీలిస్తే 2008–09 ఆర్థిక సంవత్సరంలో సేవారంగం పరిధిలోని ఉప రంగాలు ఎక్కువ వృద్ధిని సాధించాయి. అందులో కమ్యూనిటీ, సాంఘిక, వ్యక్తిగత సేవల్లో ఎక్కువ పెరుగుదల ఉంది. ఆ తరవాత స్థానం వ్యాపారం, హోటళ్లు, రెస్టారెంట్లు, రవాణ , నిల్వ, సమాచారాలు పొందాయి. పారిశ్రామిక రంగాన్ని తీసుకుంటే నిర్మాణం ఎక్కువ వృద్ధిని నమోదు చేయగా వస్తువుల తయారీ తక్కువ వృద్ధిని నమోదు చేసింది. ఇక ప్రాథమిక రంగంలోని వ్యవసాయం, అడవులు, చేపల పెంపకాల్లో కేవలం 1.6 శాతం వృద్ధి నమోదు కావడాన్ని మనం ప్రత్యేకంగా గమనించాలి.

| (ప్రాథమిక రంగం) ఉప రంగం | 2008–09 ఆర్థిక సం.లో జరిగిన వృద్ధి శాతం |
|---|---|
| వ్యవసాయం, అడవులు, చేపల పెంపకం | 1.6 |
| ఖనిజాల తవ్వకం, రవాణా | 3.6 |
| వస్తువుల తయారీ | 2.4 |
| విద్యుత్, గ్యాస్, నీటిసరఫరా | 3.4 |
| నిర్మాణం | 7.2 |
| వ్యాపారం, హోటళ్లు, రెస్టారెంట్లు, రవాణా, నిల్వ, సమాచారం | 9.0 |
| ఫైనాన్స్, బీమా, రియల్ ఎస్టేట్, వ్యాపార సేవలు | 7.8 |
| కమ్యూనిటీ, సాంఘిక, వ్యక్తిగత సేవలు | 13.1 |
| ఉత్పత్తి కారకాల ధరల్లో స్థూల దేశీయోత్పత్తి | 6.7 |

# మౌలిక సౌకర్యాలు పెరగాలి

**ఏ** దేశానికైనా అత్యుత్తమ, అతి పెద్ద సంపద ప్రజలే! జనాభాలో ప్రపంచంలోనే మనది రెండో స్థానం. సుమారు 108 కోట్ల జనాభా ఉన్నా అక్షరాస్యతలో 172వ స్థానంలో ఉన్నాం.

ఈ పరిస్థితిని చక్కదిద్ది పరిమాణాత్మకంగా, గుణాత్మకంగా విద్యా రంగాన్ని పటిష్ఠం చేయాలని ప్రభుత్వం కొన్ని చర్యలు చేపట్టినా వేగంగా ఫలితాలు రావడంలేదు. సర్వశిక్షా అభియాన్(అందరికీ విద్య), మధ్యాహ్న భోజన పథకం, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల ఏర్పాటు వంటి కార్యక్రమాల ద్వారా పాఠశాలలను ఎక్కువమందికి అందుబాటులోకి తేవాలని, వసతులు మెరుగుపర్చాలని, డ్రాపవుట్లను తగ్గించాలని, ఉపాధ్యాయుల సంఖ్యను పెంచి, మంచి శిక్షణ అందించాలన్న ప్రయత్నాలు జరిగాయి.

కొత్త పాఠశాలల ఏర్పాటు విషయంలో సర్వశిక్షా అభియాన్ పథకం 82 శాతం మాత్రమే సాధించింది. ఉపాధ్యాయుల నియామకాల లక్ష్యాల్లో 76 శాతానికి చేరగలిగింది. ఎస్‌ఎస్‌ఏ అంచనాల ప్రకారమే దేశంలో 1.25 లక్షల ప్రాథమికోన్నత పాఠశాలలు ఇంకా ఏర్పాటు కావాల్సి ఉంది. 6– 14 సంవత్సరాల వయస్సు గల బాల బాలికలందరికీ ఎలిమెంటరీ విద్యను ఉచితంగా, నిర్బంధంగా అందించాలనే సంకల్పానికి ఇది పెద్ద ఆటంకంగా మారింది.

మానవ వనరుల మంత్రిత్వశాఖ నిర్వహించిన ఒక సర్వే ప్రకారం, ఎస్‌ఎస్‌ఏ లక్ష్యాలకనుగుణంగా ప్రతి రెండు ప్రాథమిక పాఠశాలలకు ఒక ప్రాథమికోన్నత పాఠశాల (2:1) ఉండాల్సి ఉండగా 2004–05లో అది 2.8:1గా నిలిచింది. పాఠశాలల్లో వసతుల విషయంలోనూ నిరాశాజనిత వాతావరణమే కనిపిస్తున్నది. అధికారిక లెక్కల ప్రకారం చూసినా మూడు శాతం ప్రాథమిక పాఠశాలలకు, 2.4 శాతం ప్రాథమికోన్నత పాఠశాలలకు భవనాలు లేవు. 44.6 శాతం ప్రాథమిక పాఠశాలల్లో, 15.3 శాతం ప్రాథమికోన్నత పాఠశాలల్లో టాయిలెట్ల సదుపాయాలు లేవు. మంచినీటి సదుపాయాలదీ అదే దారి. వసతులు కొరవడితే ఎన్‌రోల్‌మెంట్‌తో పాటు విద్యా నాణ్యత దెబ్బతింటుంది. అందుకే ఈ విషయంలో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాల్సి ఉంది.

**మన దేశంలో ఉన్నత పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:18గా ఉంది. విదేశాల్లో ఇంతకంటే తక్కువ ఉంటుంది. తరగతిలో విద్యార్థుల సంఖ్య ఎంతగా పెరిగితే ఉపాధ్యాయుడు ఒక విద్యార్థిపై వెచ్చించే సమయం అంతగా తగ్గుతుంది. ఇది విద్యా నాణ్యతను బాగా దెబ్బతీస్తుంది.**

## చుక్కాని



చుక్కా రామయ్య

గతంలో తగ్గినట్లు కన్పించినా డ్రాపవుట్లు కొనసాగుతూనే ఉన్నాయి. డ్రాపవుట్ అవుతున్న బాలుర కంటే బాలికలు ఎక్కువగా ఉంటున్నారు. ఇది అత్యంత ఆందోళన కలిగించే విషయం. ఎన్‌సిఇఆర్‌టి ఇటీవల నిర్వహించిన సర్వే ప్రకారం విద్యార్థుల విద్యాసాధన క్రమేణా క్షీణిస్తున్నది! ఇందుకు ప్రధాన కారణం ఆశించిన స్థాయిలో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి ఉండకపోవడమే!

2004–05 లెక్కల ప్రకారం ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి ప్రాథమిక స్థాయిలో 1:46గా ఉండగా, ప్రాథమికోన్నత స్థాయిలో 1:35గా ఉన్నది. ఉన్నత పాఠశాల స్థాయిలో మన దేశంలో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:18గా ఉండగా, అభివృద్ధి చెందిన దేశాలైన అమెరికా, జపాన్‌లలో 1:14గా ఉన్నది. అదే ఫ్రాన్స్‌లో 1:12గా, స్విట్జర్లాండ్‌లో 1:11గా ఉండటం గమనార్హం. తరగతిలో విద్యార్థుల సంఖ్య ఎంతగా పెరిగితే ఉపాధ్యాయుడు ఒక విద్యార్థిపై వెచ్చించే సమయం అంతగా తగ్గుతుంది. ఇది విద్యా నాణ్యతను బాగా దెబ్బతీస్తుంది.

విద్యారంగంలో ఒక నిర్ణీత కాల వ్యవధిలో ఇలాంటి సమస్యలకు పరిష్కార మార్గాలు కనుగొనకపోతే గుణాత్మకంగానే కాదు; పరిమాణాత్మక విషయాల్లోనూ వెనుకబాటుతనం కొనసాగుతూనే ఉంటుంది. మానవ సంపదను ఒక శక్తిగా మలచుకోవడం కష్టమే అయినా అసాధ్యం కాదు.